సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.22

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టంగా రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.8°/21.3°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

21 మండలాల్లో వర్షం



కొండకమర్ల-పెడపల్లి రహదారిలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: వాతావరణంలో మార్పుల కారణంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ జిల్లాలోని 21 మండలాల్లో వర్షం కురిసింది. 21 మండలాల పరిధిలో ఒకేరోజు 395.8 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అమడగూరు మండలంలో 55.2 మి.మీ, తనకల్లు మండలంలో 52.4 మి.మీ వర్షం కురిసింది. ఇక తలుపుల మండలంలో 34.6 మి.మీ, గాండ్లపెంట 33.2, ఎన్పీ కుంట 27.2, బుక్కపట్నం 24.2, కదిరి 22.2, కొత్తచెరువు 18.4, ఓడీచెరువు 15.4, నల్లమాడ 14.4, నల్లచెరువు 13.2, ముదిగుబ్బ 12.6, చిలమత్తూరు 11.2, సోమందేపల్లి 10.2, పుట్టపర్తి 9.2, గోరంట్ల 8.6, హిందూపురం 7.8, పెనుకొండ 2.4, పరిగి 2, ధర్మవరం మండలంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరో నాలుగు రోజులు జిల్లాలో వర్ష సూచన ఉన్నట్లు వెల్లడించారు.

ఐసీపీఎస్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

పుట్టపర్తి అర్బన్: ఐసీపీఎస్, శిశుగృహలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాలతో ఐసీడీఎస్ పీడీ ప్రమీల సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను 'ఐసీడీఎస్ పీడీ కార్యాలయం, ప్రశాంతిగ్రామం, పుట్టపర్తి'లో అందజేయాలి. పోస్టుల వివరాలు, దరఖాస్తుల కోసం https:// srisathyasai. ap. gov. in/ వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

శ్రీవారి హుండీ లెక్కింపు



నగదును లెక్కిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా స్వామికి సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. 51 రోజులకు గాను రూ.84,94,280 నగదు, 6 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి సమకూరాయి. అలాగే 67 అమెరికన్ డాలర్లు, 20 నేపాల్ కరెన్సీ, 2,800 ఇండోనేషియా కరెన్సీ, 160 అరబ్ దిర్హామ్, 5 సౌదీ అరేబియా రియాల్స్ ఉన్నాయని ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి ఎస్.ప్రసాద్, స్థానిక బ్యాంక్‌ల మేనేజర్లు పాల్గొన్నారు.


ఎండిన ఆశలు

- వేరుశనగను తొలగిస్తున్న రైతులు



కాడెద్దుల సాయంతో వేరుశనగ పంటను తొలగిస్తున్న రైతు


గుడిబండ: రైతుల ఖరీఫ్ ఆశలు ఎండిపోయాయి. సీజన్ ఆరంభంలో పచ్చగా కళకళలాడిన వేరుశనగ ఆ తర్వాత వరుణుడి కరుణ లేక ఎండుముఖం పట్టింది. ఎకరాకు రూ.35 వేలు ఖర్చు చేసి సాగు చేసిన వేరుశనగ కళ్లెదుటే ఎండిపోగా..ట్రాక్టర్, కాడెద్దుల సాయంతో రైతులు పంటను తొలగిస్తున్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసి పంట దెబ్బతిన్న రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా గుడిబండను కరువు మండలంగా ప్రకటించాలని కోరుతున్నారు.



ఎండిన వేరుశనగ పంటను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న రైతులు

- కనగానపల్లి మండలం తూముచెర్ల రెవెన్యూ పొలంలో 60 ఎకరాలకు పైగా భూమిని విక్రయించేందుకు యజమానులు సన్నద్ధమయ్యారు.భూమి కొనుగోలుదారులు అనంతపురం నగరానికి చెందిన వారు కావడంతో 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' కింద నగరంలోని రామ్‌నగర్ కార్యాలయంలోనే 60 ఎకరాల భూమికి మార్కెట్ విలువ ప్రకారం స్టాంప్ డ్యూటీ చెల్లించి సెప్టెంబర్ 15న రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. తూముచెర్ల భూములు చెన్నేకొత్తపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోకి వస్తుండడంతో ఆమోదం కోసం చెన్నేకొత్తపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 'కార్డు సాఫ్ట్‌వేర్' ద్వారా పంపారు. అయితే, 'అసైన్డ్' భూములంటూ అక్కడి సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించారు. వాస్తవంగా తూముచెర్ల సర్వే నంబర్ 99లోనివి పట్టా భూములు కావడం గమనార్హం. ఈ క్రమంలో భూముల రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించే ఆస్కారమే లేదు. తనను 'ప్రసన్నం' చేసుకోలేదనే ఏకైక కారణంతో చెన్నేకొత్తపల్లి సబ్ రిజిస్ట్రార్ ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు తిరస్కరించినట్లు తెలుస్తోంది.

- కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఓ వ్యక్తి స్థిరాస్తి రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే అక్కడి సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. 'ఎనీవేర్' కింద అనంతపురం నుంచి రిజిస్ట్రేషన్ పెట్టుకోండి ఆమోదం తెలుపుతానని హామీ ఇచ్చారు. సదరు స్థిరాస్తి యజమాని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలుపగా.. రామ్‌నగర్‌లో ఉన్నానని, అక్కడికి వచ్చి డబ్బు ఇవ్వాలని సూచించారు. ఆ మేరకు గత నెలలో డబ్బు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. 'ఎనీవేర్'ను కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఎలా 'క్యాష్' చేసుకుంటున్నారో ఈ రెండు ఘటనల ద్వారా సులువుగా అర్థం చేసుకోవచ్చు.



పైసలిస్తేనే ఎనీవేర్

- ప్రభుత్వ లక్ష్యానికి కొందరు సబ్ రిజిస్ట్రార్ల తూట్లు
- ప్రసన్నం చేసుకుంటే ఓకే అంటున్న వైనం
- లేదంటే కొర్రీలు పెడుతూ తిరస్కరణ
- పట్టించుకోని ఉన్నతాధికారులు

అనంతపురం టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. రిజిస్ట్రేషన్ సేవలను వినియోగదారులకు చేరువ చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. రిజిస్ట్రేషన్ ఎక్కడి నుంచైనా చేసుకునేందుకు వీలుగా 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' విధానాన్ని తీసుకొచ్చారు.

సమర్పించుకుంటేనే..

ప్రభుత్వం ఎనీవేర్ రిజిస్ట్రేషన్లను ప్రోత్సహించాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. సర్కారు లక్ష్యానికి కొందరు సబ్ రిజిస్ట్రార్లు తూట్లు పొడుస్తున్నారు. వివిధ రకాల కారణాలు చూపుతూ రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో సబ్ రిజిస్ట్రార్లను ప్రసన్నం చేసుకొని ముడుపులు సమర్పించుకుంటే 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల'కు ఇట్టే ఆమోదం తెలుపుతున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. లేకుంటే ఏదో ఒక కొర్రీతో తిరస్కరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ నష్టమట!

ఎనీవేర్ కింద రిజిస్ట్రేషన్లు చేస్తే స్థానిక కార్యాలయాలకు రెవెన్యూ నష్టమొస్తుందంటూ సబ్ రిజిస్ట్రార్లు దాట వేస్తుండడం గమనార్హం. రాష్ట్రంలో ఎక్కడి నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకున్నా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకే ఆదాయం వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రత్యేకంగా రెవెన్యూ నష్టం ఎలా వస్తుందో అర్థం కాని పరిస్థితి. కేవలం తమకు అక్రమ ఆదాయం తగ్గుతుందనే కారణంతో 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్ల'ను తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక.. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా 10 నిమిషాల్లో ముగిసేలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రెండు గంటల్లో డాక్యుమెంట్లు సైతం వినియోగదారులకు అందించే వెసులుబాటు కల్పించింది. అయినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డాక్యుమెంట్లు పొందేందుకు వారాలు పడుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే సబ్ రిజిస్ట్రార్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు చేయాల్సిందే..



రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం చేసేందుకు ప్రవేశపెట్టిన ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని సబ్ రిజిస్ట్రార్లు అమలు చేయాల్సిందే. ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లు చేసుకుంటుంటే తిరస్కరించాలి. పట్టా భూములను తిరస్కరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ

10న 'పురం'లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశం

మడకశిర: ఈ నెల 10న ఉదయం 10 గంటలకు హిందూపురంలోని చౌడేశ్వరీ కాలనీలో ఉన్న సాయిరాం ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్‌బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకరావు, జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప, ఇతర నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్న ఈ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



సత్యసాయి రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి టౌన్: పౌర్ణమిని సందర్భంగా సోమవారం సత్యసాయి గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. అందంగా అలకరించిన రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రశాంతినిలయం ముఖద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం రథాన్ని విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపులు, శివాలయం వీధి, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా తిరిగి ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఉత్సవంలో దేశవిదేశీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చట్టం లేదు.. అంతా తూచ్!

- టీచర్ల సిఫార్సు బదిలీలకు గేట్లు తెరిచిన కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో ఇద్దరు టీచర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- గత ప్రభుత్వంలో గగ్గోలు పెట్టిన లోకేష్
- అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే నేరుగా బదిలీలకు శ్రీకారం
- ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల మండిపాటు

"ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత, నిష్పాక్షికత ఉండేలా ముసాయిదా చట్టాన్ని తయారు చేశాం. బదిలీల్లో అవినీతి, రాజకీయ జోక్యాన్ని అరికడతాం. ఎలాంటి వివాదాలకు తావులేకుండా, ఉపాధ్యాయుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఏటా వేసవి సెలవుల్లో మాత్రమే బదిలీలు జరిగేలా చట్టం రూపొందించాం.." కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలివీ. అయితే, సరిగ్గా ఏడాదిన్నర కాలానికే సిఫార్సు బదిలీలకు కూటమి ప్రభుత్వం గేట్లు ఎత్తడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

అనంతపురం ఎడ్యుకేషన్: మూడు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా పదుల సంఖ్యలో టీచర్లను ప్రభుత్వమే నేరుగా బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇద్దరు టీచర్లు బదిలీలు అయ్యారు. కణేకల్లు మండలం మాల్యం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌ఏ తెలుగు టీచరుగా పని చేస్తున్న దేవన గోపమ్మను బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు, మడకశిర మండలంలో ఎస్జీటీగా పనిచేస్తున్న రాధను నల్లచెరువు మండలం గజేఖాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేశారు. ఈ బదిలీల వెనుక పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారడంతో పాటు రాజకీయ పలుకుబడి ఉపయోగించారనే విమర్శలు విద్యాశాఖలో గుప్పుమంటున్నాయి. ఇది ఆరంభమేనని, రానున్న రోజుల్లో మరింతమంది బదిలీల ఉత్తర్వులు రానున్నాయని కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.



వారు చేస్తే తప్పు... వీరు చేస్తే రైటా?

గత ప్రభుత్వంలో కొందరు టీచర్లు వారి వ్యక్తిగత అవసరాల నేపథ్యంలో ఇలానే నేరుగా బదిలీలు చేయించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 30 మంది దాకా బదిలీ అయ్యారు. వారందరూ తీరా స్కూళ్లలో చేరే సమయంలో ప్రభుత్వం మారింది. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నారా లోకేష్ ఆ బదిలీలకు ససేమిరా ఒప్పుకోకుండా అడ్డుపుల్ల వేశారు. వాటిని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధితులు కోర్టును ఆశ్రయించినా లాభం లేకపోయింది. అదే విద్యాశాఖ మంత్రి తాజాగా ప్రభుత్వ బదిలీలను ఎలా అంగీకరిస్తున్నారంటూ సామాన్య టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం చేసింది తప్పయితే ఈ ప్రభుత్వం చేసింది రైటా? అని ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీల కోసం ప్రత్యేక ముసాయిదా చట్టం తీసుకొచ్చిన వారే చట్టాన్ని తుంగలో తొక్కారని మండిపడుతున్నారు. ప్రభుత్వ బదిలీలపై కొందరు కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు.

దారి లేకుండా గోడ కట్టారు

- టీడీపీ నాయకుడి దుశ్చర్యను అడ్డుకోండి
- కలెక్టర్‌కు మొరపెట్టుకున్న అమడగూరు మండల వాసి
- 'పరిష్కార వేదిక'కు 205 అర్జీలు

☛ నేను ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ హిందూపురంలో ఉంటున్నా. కస్సముద్రం పంచాయతీ తోల్లపల్లిలోని మా స్వగ్రామంలో తల్లిదండ్రులు ఉంటారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జి.రవీంద్ర మా తల్లిదండ్రులపై దౌర్జన్యం చేస్తూ మా ఇంటికి దారి లేకుండా గోడ కట్టేశాడు. ఈ విషయాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. "నీకు దిక్కున్నచోట చెప్పుకో" అంటూ టీడీపీ నాయకుడు మాపై దౌర్జన్యం చేస్తూ బెదిరిస్తున్నాడు. మీరైనా చర్యలు తీసుకుని మమ్మల్ని రక్షించి ఇంటికి దారి చూపండి

– కలెక్టర్‌ను వేడుకున్న అమడగూరు మండలం తోల్లపల్లికి చెందిన రవి

☛ నాకు 90 శాతం వైకల్యం ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించారు. అయినా అధికారులు పింఛన్ మంజూరు చేయడం లేదు. నా తండ్రికి వృద్ధాప్య పింఛన్ వస్తోందని, అందువల్ల నాకు పింఛన్ మంజూరు చేయడం లేదని చెబుతున్నారు. వాస్తవానికి అర్హత మేరకు నాకు పింఛన్ మంజూరు చేసే వెసులుబాటు ఉంది.. అయినా అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ వేధిస్తున్నారన్నారు. అర్హత మేరకు నాకు పింఛన్ మంజూరు చేయించి ఆదుకోండి.

– కలెక్టర్‌కు మొరపెట్టుకున్న అగళి మండలం అకౌరె గ్రామానికి చెందిన జయరామప్ప



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

..ఇలా పలువురు బాధితులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు మొరపెట్టుకున్నారు.

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు వెల్లువెత్తాయి. తమ సమస్యలు పరిష్కరించండి సారూ అంటూ జనం కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు మొరపెట్టుకున్నారు. అధికార పార్టీ నాయకుల ఆగడాలపై ఫిర్యాదులు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై మొత్తంగా 205 అర్జీలు అందాయి. కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా గడువులోపు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- హోంగార్డు ప్రియాంకను వేధించిన వారిని కఠినంగా శిక్షించాలి
- కేసు నమోదులో తాత్సారం చేసిన సీఐ శేఖర్‌పై చర్యలు తీసుకోవాలి
- గోరంట్ల స్టేషన్ ఎదుట వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధర్నా
- సీఐపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి పత్రం అందజేత



గోరంట్ల పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఉషశ్రీ చరణ్ తదితరులు



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పుట్టపర్తి టౌన్/గోరంట్ల: కూటమి సర్కార్ కొలువుదీరాక రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. చివరకు ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసుశాఖలో పనిచేసే మహిళలకే రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గోరంట్ల పోలీసు స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్న ప్రియాంక ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఇరువురు క్యాబ్ డ్రైవర్లను అరెస్టు చేసి శిక్షించడంతో పాటు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకుండా తప్పుదోవ పట్టిస్తున్న సీఐ శేఖర్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం తొలుత గోరంట్ల పోలీసు స్టేషన్ ఎదుట పార్టీ శ్రేణులు, గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం నేరుగా పుట్టపర్తికి వెళ్లి ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి సీఐపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.

ఆడబిడ్డ వ్యక్తిత్వాన్ని కించపర్చడం దుర్మార్గం

తనను క్యాబ్ డ్రైవర్లు మొయినుద్దీన్, షఫీ లైంగికంగా వేధిస్తున్నారని హోంగార్డు ప్రియాంక సీఐ శేఖర్‌కు ఫిర్యాదు చేస్తే...ఆయన బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. గోరంట్ల పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా అనంతరం ఎస్పీ కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడారు. ప్రియాంకను లైంగికంగా వేధించిన వారిపై చర్యలు తీసుకోకుండా ఆమె వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ గౌరవాన్ని దెబ్బతీసేలా సీఐ శేఖర్ వ్యవహరించారన్నారు. "నీ ప్రవర్తన బాగోలేదుక్వార్టర్స్ ఖాళీ చేయ్' అని సీఐ ఆదేశించారని, అందుకే కలత చెందిన ప్రియాంక ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. ఈ దారుణం గురించి తెలిసి హోంగార్డుకు న్యాయం చేయాలని అడిగేందుకు తాను వెళితే..దురుసుగా మాట్లాడారన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన ఉద్యోగంలో ఉన్న మహిళే వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేయడం దారుణమన్నారు. కేవలం సీఐ శేఖర్ మాటలతోనే హోంగార్డు ప్రియాంక కలతచెంది ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఇలాకాలో జరిగిన ఈ ఘటనకు ఆమె సమాధానం చెప్పి తీరాలన్నారు. బాధితురాలిని పరామర్శించే సమయం కూడా మంత్రికి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ శేఖర్ గోరంట్లలో బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అధికార పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ పలు అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రియాంకకు న్యాయం జరిగేవరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాటాలు చేస్తామన్నారు. ఈ ఘటనను జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టి తీసుకెళ్తామన్నారు. అలాగే ఇరువురు డ్రైవర్లు షఫీ, మొయినుద్దీన్‌లను అరెస్ట్ చేసి సీఐ శేఖర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్ల వెల్లడించారు.

ఆ సీఐకి గిరిజనులంటే చులకన..

అఖిల భారత బంజారా సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ... గతంలో గిరిజన మహిళలపై జరిగిన అఘాయిత్యాలపై సీఐ శేఖర్ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గిరిజనులను ఆయనకు చులకనగా చూస్తారన్నారు. ప్రియాంక ఘటన గురించి తాను సీఐకి ఫోన్ చేస్తే...ఆమె నడవడిక బాగోలేదని ఆయన చెప్పడం దుర్మార్గమన్నారు. ఆడబిడ్డకు అండగా నిలవాల్సిన సీఐ... ఆమె వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరించడం ఎంతవరకు న్యాయమన్నారు. ఇలాంటి వారిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. తాము కూడా సంఘం తరఫున ఆధారాలతో ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సీఐ శేఖర్‌ను సస్పెండ్ చేసే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సాయిలీల, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గోరంట్ల మండల కన్వీనర్ వెంకటేశు, గోరంట్ల పట్టణ కన్వీనర్ మేదర శంకర, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, మండల పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో బంజారాలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదంలో విద్యార్థులకు తీవ్రగాయాలు

ధర్మవరం రూరల్: మండలంలోని గొళ్లపల్లి వద్ద సోమవారం చోటు చేసుకున్న ప్రమాదంలో డిగ్రీ విద్యార్థులు హబీబుల్లా, రాజేష్ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన మేరకు... పుట్టపర్తికి చెందిన హబీబుల్లా, రాజేష్... అక్కడి మంగళకర కాలేజీలో డిగ్రీ మూడవ సంవత్సరం చదుతున్నారు. వీరిద్దరూ వ్యక్తిగత పనిపై ధర్మవరం - చిగిచెర్ల మీదుగా అనంతపురానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. గొళ్లపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒంటరి వృద్ధుడి మృతి

తనకల్లు: మండలంలోని ముండ్లవారిపల్లి సమీపంలో పాపాగ్ని నది వద్ద వెంకటప్ప(60) మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. అమడగూరు మండలం పూలకుంటపల్లికి చెందిన వెంకటప్ప పదేళ్లుగా కొక్కంటిక్రాస్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. వ్యవసాయ పనులు, చిన్నపాటి కూలీ పనులతో జీవనం సాగించేవాడు. అయితే సోమవారం పాపాగ్ని నది పక్కన మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కోటపల్లి వీఆర్వో గంగాధర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా వృద్ధుడి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

వివాహిత బలవన్మరణం


మృతురాలు ఆస్మా

హిందూపురం: స్థానిక సీపీఐ కాలనీలో నివాసముంటున్న వివాహిత ఆస్మా (28) ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు భర్త ఖాజా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఖాజా చెడు వ్యసనాలకు బానిస కావడంతో జీవితంపై విరక్తి చెందిన ఆస్మా సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై రెండో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వలస కార్మికుడి మృతి


మృతుడు రాజ్‌కుమార్

ధర్మవరం అర్బన్: స్థానిక మారుతీనగర్‌లో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు పైనుంచి జారి పడి వలస కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి మండలం పిడింగొయ్య గ్రామానికి చెందిన గెడ్డం రాజ్‌కుమార్(39) 15 రోజుల క్రితం వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేసేందుకు వచ్చాడు. ఆదివారం సాయంత్రం ట్యాంక్‌పై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజ్‌కుమార్ తమ్ముడు గెడ్డం ప్రసాద్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు.

ప్రాణాలైనా వదులుతాం..భూములివ్వం

- భూసేకరణను నిరసిస్తూ గ్రామ సభను బహిష్కరించిన రైతులు
- వివిధ గ్రామాలకు చెందిన వందలాదిమంది రైతుల రాస్తారోకో
- బాబూ..వ్యవసాయం నుంచి తమను దూరం చేయొద్దని వేడుకోలు


రైతులు బహిష్కరించడంతో గ్రామసభలో మిగిలిన అధికారులు


రాస్తారోకో చేస్తున్న వివిధ గ్రామాల రైతులు, రైతు సంఘం నాయకులు

హిందూపురం: ''ఈ భూములను నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నా. ఇప్పుడు వీటిని లాక్కుంటే మా కుటుంబాలు రోడ్డున పడతాయి. అందుకే మా ప్రాణాలైనా వదులుతాం.. భూములు మాత్రం ఇవ్వబోం'' అని రైతులు తేల్చిచెప్పారు. పరిశ్రమలకు భూ సేకరణ కోసం సోమవారం రెవెన్యూ అధికారులు హిందూపురం మండలం నందమూరి నగర్ గ్రామంలో రైతులతో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఒక్క హిందూపురం మండలంలోనే సుమారు 3 వేల ఎకరాలు సేకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో రైతులు తమ పొలాలు లాక్కోవద్దంటూ అధికారులను వేడుకున్నారు. పరిశ్రమల పేరు చెప్పి తమను రోడ్డున పడేయవద్దంటూ కన్నీటిపర్యంతమయ్యారు. అయినప్పటికీ అధికారులు వినిపించుకోలేదు. ప్రభుత్వ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. దీంతో రైతులు గ్రామ సభను బహిష్కరించి రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న హిందూపురం మండలం మలుగూరు, చలివేందుల, రాచేపల్లి, మీనకుంటపల్లి, బాలంపల్లి, జంగలపల్లి, బీరేపల్లి, తిమ్మగానపల్లి, కొండూరు గ్రామాల రైతులు కూడా వచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. 'పరిశ్రమలు వద్దు... వ్యవసాయం ముద్దు', 'అధికారుల వైఖరి నశించాలి' అంటూ నినాదాలు చేశారు. ఆందోళనకు దిగిన రైతులకు రైతు సంఘం నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ...రైతే దేశానికి వెన్నముక అంటారు.. అలాంటి రైతుల పొలాలను లాక్కోడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. 'చంద్రబాబూ వ్యవసాయం నుంచి మమ్మల్ని దూరం చేయకు' అంటూ మొరపెట్టుకున్నారు. అయినా భూసేకరణ చేయాలంటే రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం... పొలాలకు మూడింతల ధర చెల్లించాలని కోరారు.

పంట భూములు తీసుకుంటే సహించం

పరిశ్రమలు అవసరమే అయినా.. ఏడాదికి మూడు పంటలు పండే భూములను తీసుకుంటామంటే సహించబోమని రైతు సంఘం నాయకులు తేల్చి చెప్పారు. కూటమి సర్కార్ అభివృద్ధి పేరుతో వ్యవసాయమే జీవనాధారంగా బతికే వందలాది కుటుంబాలు పొట్ట చేత పట్టుకొని ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే దుస్థితి కల్పిస్తోందని మండిపడ్డారు. భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల తరఫున పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతుకు అండగా ఉంటాం



అసలు భూములు ఎందుకు సేకరిస్తున్నారో చెప్పడం లేదు. కానీ గ్రామసభ అంటూ పాసుబుక్కు, ఆధార్, బ్యాంకు పాసుబుక్కులు తీసుకురావాలని చాటింపు వేయించారు. వాటితో బలవంతంగా భూములు స్వాధీనం చేసుకుంటారా..?. మా ప్రాణం పోయినా ఎకరం కూడా అప్పగించం. మీ కంపెనీల వల్ల రైతు కుటుంబాలకు ఏం ప్రయోజనం, ఎంత పరిహారం ఇస్తారు.. అనే విషయాలు చెప్పకుండా పాసు బుక్కులు తీసుకురండి అని చెప్పడమేమిటి. రైతు చేసే ప్రతి పోరాటానికీ మద్దతు తెలుపుతాం.

– సిద్దారెడ్డి, రైతు సంఘం నాయకుడు

పొలం తీసుకుంటే ఎక్కడికి పోవాలి?



నాకున్నది ఎకరా. ఆ భూమినే సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. అది కూడా తీసుకుంటే ఎక్కడికి పోవాలి. ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సింది పోయి.. ఉన్న భూమిని లాక్కుంటే చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుంది. రైతులు బాగుంటేనే సమాజం బాగుంటుంది. ఇది ఎందుకు అర్థం చేసుకోవడంలేదు.

– నరసప్ప, నందమూరి నగర్

మమ్మల్ని బతకనివ్వండి



మా తాతల కాలం నుంచి ఇదే ఊరును... భూములను నమ్ముకుని ఇక్కడే జీవిస్తున్నాం. దీన్ని వదిలేసి వెళ్లమంటే ఏం ఎక్కడికి వలస పోవాలి. ఏటా మేము వరి, మిర్చి ఇతర పంటలు పెట్టుకుని వచ్చినంత పంటలతో జీవనం సాగిస్తున్నాం. అవి కూడా లాగేసుకుంటామంటే మేం ఏంకావాలి. మా బతుకు మమ్మల్ని బతకనివ్వండి.

– రామలింగ, రాచేపల్లి

నిధులు విడుదల చేయకుంటే ఇళ్లు ముట్టడిస్తాం

- మంత్రి సవిత, ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ హెచ్చరిక


మాట్లాడుతున్న కేవీ ఉష శ్రీచరణ్ (చిత్రంలో) ఈరలక్కప్ప

ప్రశాంతి నిలయం: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను పార్టీలకు అతీతంగా అన్ని పంచాయతీలకు మంజూరు చేయాలని, లేకుంటే మంత్రి సవిత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇళ్లను సర్పంచ్‌లతో కలసి ముట్టడిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉష శ్రీచరణ్, మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప హెచ్చరించారు. మడకశిర, పెనుకొండ నియోజకవర్గాలలో 15వ ఆర్థిక సంఘం నిధులను పచ్చ కండువాలు కప్పుకుంటేనే మంజూరు చేస్తామంటూ స్థానిక ఎమ్మెల్యేలు సవిత, ఎంఎస్ రాజు వ్యవహరిస్తున్న తీరును వారు ఖండించారు. ఈ అంశంపై న్యాయం కోరుతూ సోమవారం పలువురు సర్పంచ్‌లతో కలసి కలెక్టరేట్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఉష శ్రీచరణ్ మాట్లాడుతూ.. పంచాయతీలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సర్పంచ్‌లు పనిచేస్తున్నారన్నారు. ఇలాంటి తరుణంలో నిధులు మంజూరు కాకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో తాను సూచించిన పంచాయతీలకే ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించడం మంత్రి సవిత దుర్మార్గానికి నిదర్శనమన్నారు. నిధుల మంజూరులో వివక్ష చూపితే మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ... కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులపై కూటమి నాయకుల పెత్తనం చెలాయించడం దారుణమన్నారు. టీడీపీకి చెందిన సర్పంచ్‌లకు మాత్రమే నిధులు మంజూరు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదేశించడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. వివక్ష లేకుండా అన్ని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెనుకొండ, మడకశిర నియోజకవర్గాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శ్రీరామరెడ్డి స్ఫూర్తిని అందిపుచ్చుకోండి

- కేరళ మాజీ డీజీపీ సయ్యద్ మహమ్మద్ యాసిన్


క్రికెట్ విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న సయ్యద్ మహమ్మద్ యాసిన్ (చిత్రంలో) మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి

మడకశిర రూరల్: స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎంపీ శ్రీరామరెడ్డి స్ఫూర్తిని అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులకు కేరళ మాజీ డీజీపీ బి.సయ్యద్‌మహమ్మద్ యాసిన్ పిలుపునిచ్చారు. మడకశిర మండలం నీలకంఠాపురంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శ్రీరామరెడ్డి 120వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీరామరెడ్డి సమాధికి శ్రీరామరెడ్డి, రఘువీరారెడ్డి కుటుంబసభ్యులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో మాజీ డీజీపీ మాట్లాడారు. శ్రీరామరెడ్డి సాగించిన ఉద్యమాలను కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీరామరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నీని నీలకంఠాపురం జట్టు కైవసం చేసుకుంది. రన్నర్స్‌గా రొళ్లలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల జట్టు నిలిచింది. విజేత జట్లను అభినందిస్తూ ట్రోఫీలను మాజీ డీజీపీ ప్రదానం చేశారు. అలాగే పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు, ఉత్తమ రైతులకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, శ్రీరామరెడ్డి కుటుంబసభ్యులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, సేవామందిరం విద్యాసంస్థల అధినేత కేటీ శ్రీధర్, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, రైతులు పాల్గొన్నారు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య


మహేష్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: స్థానిక లోనికోటకు చెందిన తొండమాల మహేష్ (37) ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష్మీచెన్నకేశవపురంలో ఇనుప సామాన్ల అంగడిలో పనిచేసేవాడు. గత 15 సంవత్సరాలుగా పెళ్లి కోసం కుటుంబసభ్యులు ప్రయత్నాలు చేసినా సంబంధాలు కుదరక పోవడంతో మనో వేదనకు లోనయ్యాడు. సోమవారం ఉదయం పనికి వెళుతున్నట్లు తల్లి సుబ్బమ్మకు తెలిపి ఇంటి నుంచి బయటకు వచ్చిన మహేష్ దుకాణానికి వెళ్లలేదు. వ్యక్తిగత పనిపై తల్లి బయటకు వెళ్లిన సమయంలో ఇంటికి చేరుకుని చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి సుబ్బమ్మకు దుకాణం యజమాని ఫోన్ చేసి మహేష్ పనికి రాలేదని తెలపడంతో ఆమె నేరుగా ఇంటికెళ్లి చూసింది. ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడుని చూసి బోరున విలపించింది. గతంలో భర్త రామాంజనేయులు అనారోగ్యంతో మృతి చెందగా.. ఇప్పుడు ఉన్న ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె ఆవేదనకు అంతు లేకుండా పోయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

మంద నుంచి 50 గొర్రెల అపహరణ


దొంగలు ఎత్తుకెళ్లగా మిగిలిన జీవాల వద్ద కాపరి జయాబాయి

పుట్టపర్తి అర్బన్: మంద నుంచి 50 గొర్రెలను అపహరించుకెళ్లిన ఘటన పుట్టపర్తి మండలం పెడపల్లి పెద్ద తండాలో చోటు చేసుకుంది. వివరాలు.. పెడపల్లి పెద్ద తండాకు చెందిన జగదీష్‌నాయక్, జయాబాయి దంపతులు చాలా కాలంగా సుమారు 78 గొర్రెల మందను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. రోజూ గొర్రెల మంద వద్దనే పడుకునే జగదీష్‌నాయక్ ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో జల్లులు పడుతుండడంతో పక్కనే ఉన్న ఓ ఇంటి ఆవరణలో మంచం వేసుకొని నిద్రించాడు. సోమవారం వేకువజామున దుండగులు అక్కడకు చేరుకుని మందను సమీపంలోని జాతీయ రహదారిలోకి మళ్లించారు. మంద సమీపంలోనే కట్టేసిన ఐదు పాడి ఆవుల మెడ తాళ్లను తప్పించారు. జాతీయ రహదారిపైకి మందను తోలుకెళ్లి 50 గొర్రెలు, పొట్టేళ్లను వాహనంలోకి ఎక్కించుకుని ఉడాయించారు. సుమారు 25 గొర్రెలు, మేకలు, పాడి ఆవులను వదిలేశారు. తెల్లవారుజాము 3 గంటల సమయంలో కుక్కలు అరుస్తుండడంతో మేల్కొన్న జగదీష్‌నాయక్... గొర్రెలు లేని విషయం గమనించి కుటుంబసభ్యులు, బంధువులతో కలసి గాలింపు చేపట్టాడు. సోమవారం జీవాల సంతలు ఉన్న పావగడ, గోరంట్ల, పేరేసంద్రం, బెంగళూరు మార్కెట్లకు తరలించి ఉంటారనే అనుమానతంతో తలా ఓ దిక్కున వెళ్లారు. సోమవారం చీకటి పడుతున్నా గొర్రెల జాడ తెలియరాలేదని బాధిత కాపరి వాపోయాడు. అపహరించుకెళ్లిన జీవాల విలువ రూ.5 లక్షలకు పైగా ఉంటుందని కన్నీంటి పర్యంతమయ్యాడు.

రైలు కిందపడి...


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

అనంతపురం సిటీ: స్థానిక తాటిచెర్ల మార్గంలోని నేషనల్ హైవే బ్రిడ్జి కింద సోమవారం గూడ్స్ రైలు కింద పడి మల్లెల రవికుమార్(45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తొలుత గుర్తు తెలియని మృతదేహంగా భావించినా ఆ తరువాత మృతుడు అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురానికి చెందిన రవికుమార్‌గా గుర్తించినట్లు వివరించారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారన్నారు. కుటుంబ కలహాలు, ఆర్థికపర సమస్యలతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బావిలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్


ట్రాక్టర్‌తో పాటు బావిలో పడిన రైతును వెలికి తీస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ట్రాక్టర్ అదుపు తప్పి నేరుగా వెళ్లి బావిలో పడింది. వివరాలు.. ఆత్మకూరు మండలం తలుపూరు గ్రామానికి చెందిన రైతు రామచంద్రారెడ్డి సోమవారం ఉదయం ట్రాక్టర్‌తో తన పొలంలో సేద్యం చేస్తుండగా అదుపు తప్పి నీళ్లు లేని బావిలోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. ట్రాక్టర్‌తో పాటు బావిలో పడిన రామచంద్రారెడ్డిని వెలికి తీసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో మంచానికి తాళ్లు కట్టి బావిలో దించారు. అనంతరం దానిపై రామచంద్రారెడ్డిని చేర్చి పైకి లాగారు. తీవ్ర గాయాలైన రామచంద్రారెడ్డిని 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

గుత్తి: స్థానిక జీఆర్పీ పరిధిలోని తురకపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారు జామున ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న జీఆర్పీ ఇన్‌చార్జ్ ఎస్ఐ మహేంద్ర, కానిస్టేబుల్ నాగరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్య చేసుకున్న ప్రాంతంలో ఉన్న టీవీఎస్ బైక్‌ను స్టేషన్‌కు తరలించారు. బైక్ నంబర్ ఆధారంగా మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

బంగారం వ్యాపారికి బురిడీ

- నకిలీ గొలుసు ఇచ్చి రూ.1.40 లక్షలు చేజిక్కించుకున్న వైనం


వ్యాపారికి గొలుసు చూపుతున్న అపరిచితురాలు (సీసీ కెమెరా ఫుటేజీ)

ఉరవకొండ: స్థానిక సీఎస్ఐ చర్చి సమీపంలోని నిజాముద్దీన్ జ్యువెలరీ నిర్వాహకులు దాదాఖలందర్, తాజుద్దీన్‌ను సోమవారం ఓ మహిళా బురిడీ కొట్టించి రూ1.40 లక్షల విలువ చేసే బంగారం, నగదు తీసుకెళ్లింది. వివరాలు.. నిజాముద్దీన్ జ్యువెలరీ దుకాణానికి సోమవారం ఉదయం ఓ మహిళ వెళ్లింది. పక్కనున్న వ్యక్తిని తన భర్తగా పరిచయం చేస్తూ తమది నెరిమెట్ల గ్రామం అని, కుమార్తె వివాహం పెట్టుకోవడంతో తన వద్ద ఉన్న ఒకటిన్నర తులం బంగారు గొలుసు తీసుకుని కొంత నగదు, జత కమ్మలు ఇవ్వాలని కోరుతూ గొలుసు తీసిచ్చింది. దానిని పరీక్షించిన అనంతరం మేలిమి బంగారమేనని నిర్ధారించుకున్న వ్యాపారి దాదాఖలందర్... ఆ గొలుసుకు రూ.50 వేల నగదుతో పాటు ఆరు గ్రాముల బరువున్న కమ్మలు వస్తాయని తెలిపాడు. తానిచ్చిన బంగారు గొలుసును సదరు మహిళ చేతికి తీసుకుని అమ్మాయి పెళ్లి కాబట్టి కాస్త చూసి ఇవ్వాలంటూ బేరం ఆడింది. పాత బంగారం కావడంతో ఆ ధర వస్తోందని వ్యాపారి చెప్పడంతో చివరకు సరేనంటూ బ్యాగ్ లో ఉంచిన గొలుసు తీసిచ్చి.. వ్యాపారి ఇచ్చిన రూ.50 వేల నగదు, జత కమ్మలు తీసుకుని వెళ్లిపోయింది. కొద్ది సేపటి తర్వాత ఆ గొలుసును మరోసారి పరీక్షించగా అది నకిలీదని తేలింది. దీంతో మహిళ కోసం గాలించినా ఫలితం లేకపోయింది. సీసీ టీవీ కెమెరా ఫుటేజీల్లో సదరు మహిళా అసలైన బంగారు గొలుసు స్థానంలో నకిలీ గొలుసు మారుస్తున్న దృశ్యం స్పష్టంగా నిక్షిప్తమైంది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వ్యాపారి తెలిపాడు.

పరిష్కార వేదికకు 65 వినతులు


వికలాంగులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 65 వినతులు అందాయి. ఎస్పీ సతీష్‌కుమార్ నేరుగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. దివ్యాంగుల వద్దకు నేరుగా చేరుకుని వారి నుంచి వినతులు స్వీకరించి, మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, డీసీఆర్‌బీ సీఐ ఆదినారాయణ పాల్గొన్నారు

కిరికెరలో చోరీ

హిందూపురం: మండలంలోని కిరికెర వద్ద నివాసముంటున్న ఎడ్విన్ ఇంట్లో దుండగులు చొరబడి విలువైన బంగారు ఆభరణాలు అపహరించారు. వారం రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలసి తమిళనాడు వెళ్లిన ఎడ్విన్ సోమవారం ఇంటికి చేరుకున్నారు. అప్పటికే తలుపులు తీసి ఉండడంతో గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. 13 గ్రాముల బంగారు నగలు, 10 తులాల వెండి అపహరించినట్లుగా నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు హిందూపురం రూరల్ పోలీసులు తెలిపారు.

నిప్పంటుకుని వృద్ధుడి మృతి

తాడిపత్రి టౌన్: స్థానిక గురు లాడ్జీ సమీపంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పట్టణానికి చెందిన వడ్డే వెంకటేష్ (75) మృతి చెందాడు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో మద్యం మత్తులో తన ఇంటి సమీపంలోని చెత్త వద్ద వడ్డే వెంకటేష్ పడిపోయాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ అంటించుకుని అగ్గిపుల్ల ఆర్పకుండా పడేయడంతో చెత్తకు నిప్పు అంటుకుంది. ఎవరూ గమనించకపోవడంతో మంటలు చెలరేగి వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

140 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



జల్లిపల్లి వద్ద పోలీసులకు పట్టుబడిన బియ్యం వాహనం

కూడేరు: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 140 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం అందడంతో విజిలెన్స్ ఎస్ఐ జమాల్‌బాషా, సీఎస్‌డీటీ శాంతకుమారి కూడేరు మండలం జల్లిపల్లి వద్ద సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 140 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. అనంతపురంలోని తపోవనంలో నివాసముంటున్న బాబా ఫకృద్దీన్ తన బొలెరో వాహనంలో వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి నుంచి 140 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అనంతపురం మీదుగా కర్ణాటకకు తరలిస్తున్నట్లుగా గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం డంప్ స్వాధీనం

ఉరవకొండ: స్థానిక స్పైస్ ఇన్ రైస్ రెస్టారెంట్ సమీపంలో అక్రమంగా డంప్ చేసిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం ఉదయం తహసీల్దార్ మహబూబ్‌బాషా, సిబ్బంది, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం నిల్వలు ఎవరో చేశారో విచారణ చేస్తున్నట్లు సీఐ మహానంది తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం


లక్ష్మీనారాయణ నాయక్ మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

ఆత్మకూరు: అవమాన భారం తాళలేక హంద్రీ-నీవా కాలువలో దూకి గల్లంతైన ఆత్మకూరు మండలం పంపనూరు తండాకు చెందిన లక్ష్మీనారాయణ నాయక్ (45) మూడు రోజుల తర్వాత మృతదేహమై తేలాడు. వివరాలు.. తనను ఇంటి పక్కన ఉన్న మహిళ చెప్పుతో కొట్టడంతో గ్రామంలో పరువు పోయిందంటూ మనో వేదనకు లోనైన లక్ష్మీనారాయణ నాయక్ శనివారం సాయంత్రం హంద్రీ-నీవా కాలువలో దూకిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పోలీసులు, స్థానికులు ముమ్మర గాలింపు చేపట్టారు. సోమవారం ఉదయం ఆత్మకూరు మండలం గొరిదిండ్ల సమీపంలో కాలువలో మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.